క్లుప్తంగా

కె.జె.పురంలో మోదమాంబ పండగ చాటింపు


కె.జె.పురం మోదమాంబ అమ్మవారు

మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామ ప్రధాన ఆరాధ్య దైవం, మోదమాంబ అమ్మవారి జాతర ఈ నెల 20న నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం రాత్రి అమ్మవారి పండగ చాటింపు వేశారు. అమ్మవారి ఘటాలను సోమవారం రాత్రి నుంచి ఊరేగింపు జరుగుతుందని ఉత్సవ కమిటీ చైర్మన్ రాపేట జోగినాయుడు తెలిపారు. ఈ నెల 19వ తేదీ రాత్రి సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శన స్థానిక కళావేదికపై జరుగుతుందన్నారు.

మోదమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు


ఎం.కోడూరు మోదమాంబ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: ఎం.కోడూరు మోదమాంబ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులకు గ్రామానికి చెందిన పడాల కొండలరావు, లక్ష్మీకుమారి దంపతుల ఆర్థిక సహకారంతో ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పడాల కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు

పాయకరావుపేట: పట్టణంలో ప్రభుత్వ ఐటీఐలో 2025–26 విద్యా సంవత్సరంలో రెండో విడత ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 20వ తేదీలోగా విద్యార్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అన్ని ధ్రువపత్రాలతో ప్రభుత్వ ఐటీఐకు వచ్చి ఈ నెల 21వ తేదీలోగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకోవాలని తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోకుంటే వారి పేర్లు మెరిట్ లిస్టులో ఉండవన్నారు. ఎస్సెస్సీ, క్యాస్ట్, పాస్ ఫొటో, ఈమెయిల్ ఐడీ, ఆధార్ లింక్ ఫోన్ నంబర్, ఆధార్ కార్డుతో ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలన్నారు. కౌన్సెలింగ్ కోసం 7013737243, 9989478278 నంబర్లను సంప్రదించాలన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక


బేబీ భవిష్య

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో గాయత్రి హైస్కూలుకు చెందిన విద్యార్థిని కోన బేబీ భవిష్య శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 582 మార్కులు సాధించిన మేరకు రెండో విడత జాబితాలో ఎంపికైనట్లు పాఠశాల కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో ఆమెను పాఠశాల కమిటీతోపాటు ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

గోరింటాకు విశిష్టతపై అవగాహన



పరవాడ: గోరింటాకు పెట్టుకోవడం ద్వారా కొన్ని అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని సమరసత సేవా ఫౌండేషన్ మహిళా విభాగం మండల కన్వీనర్ పెదపాటి కృష్ణవేణి తెలిపారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఫౌండేషన్ ప్రతినిధులు అచ్యుతాపురం వికలాంగుల ఆశ్రమంలో గోరింటాకు విశిష్టతపై అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. పిల్లలకు గోరింటాకు పెట్టడం వలన వైరస్, క్రిమికీటకాలు దరి చేరవన్నారు. కార్యక్రమంలో భాగంగా గోరింటాకు విశిష్టతపై పిల్లలకు అవగాహన కల్పించారు. పిల్లలందరి చేతులకు గోరింటాకు పెట్టి వారితో మాటామంతీ కలిపారు. వికలాంగుల పాఠశాల కరస్పాండెంట్ పి.ఎస్.టి.పట్నాయక్, ఇన్‌చార్జి హెచ్‌ఎం పాలిపిల్లి శ్రీను, ఫౌండేషన్ ప్రతినిధులు బొద్దపు నూకరత్నం, పూర్ణ, కింతాడ వరలక్ష్మి పాల్గొన్నారు.

అయ్యో.. వర్షాభావం.!

- భానుడి ప్రతాపంతో ఎండుతున్న నారుమడులు
- కాపాడుకునే పనిలో రైతుల అగచాట్లు


కొండల అగ్రహారంలో ఒక మడిలో నీటిని మరో నారుమడికి దోసిళ్లతో పట్టి వేస్తున్న రైతు


కొండల అగ్రహారంలో ఇంజిన్లతో నారుమడికి నీరు పెడుతున్న రైతులు

మాకవరపాలెం: వరుణుడి కరుణ కోసం వరి రైతులు ఎదురు చూస్తున్నారు. మండలంలో ఏటా ఖరీఫ్‌లో 1400 హెక్టార్లలో వరిసాగు చేస్తారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు అనుకూలించడంతో రైతులు ఎంతో హుషారుగా వరినారుకు విత్తనాలు చల్లుకున్నారు. గత నాలుగు రోజులుగా వేసవిని తలపించేలా భానుడు తన ప్రతాపం చూపడంతో కొండల అగ్రహారం, మాకవరపాలెం, రామన్నపాలెం, జంగాలపల్లి, పి.పి.అగ్రహారం, తామరం, తదితర గ్రామాల్లో నారుమడులు ఎండిపోయే స్థితికి చేరాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో నారుమడులను సంరక్షించుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. అదనపు భారమైనా లెక్కచేయకుండా సమీప చెరువులు, బావులు, గెడ్డల నుంచి ఆయిల్ ఇంజిన్లను ఏర్పాటు చేసుకుని నీటిని సరఫరా చేసుకుంటున్నారు. వర్షాలు కురవకపోతే తీవ్రంగా నష్టపోక తప్పదని రైతులు చెబుతున్నారు.

మాడుగుల రూరల్: వర్షాభావ పరిస్థితులతో ఇటీవల వేసిన వరినారు మడులు ఎండిపోతున్నాయి.


కె.జె.పురంలో ఎండిపోతున్న వరి నారు

ఈ నెల మొదటి వారంలో అడపాదడపా కురిసిన వర్షాలకు రైతులు ఇబ్బడిముబ్బడిగా వరినారు మడులు దున్ని విత్తనాలు వేశారు. గత వారం రోజుల నుంచి వర్షాలు ముఖం చాటేశాయి. ప్రస్తుతం వేసవి కాలం కంటే ఎండలు కాస్తున్నాయి. వ్యవసాయ మోటారు పంపుసెట్లు ఉన్న చోట, నీరు పారే పంట భూములు తప్ప మిగిలిన చోట్ల వరినారు మడులు ఎండిపోతున్నాయి. మండలంలో 50 శాతం మేర వరినారు మడులు వేశారు. మండలంలో సుమారు 11,000 ఎకరాల భూమిలో వరి పంట వేయడానికి నారుమడులు సిద్ధం చేశారు. ఇప్పుడు వర్షాల కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఆయిల్ ఇంజిన్లకు డిమాండ్

చీడికాడ: మెట్ట గ్రామాల్లో గత 15 రోజుల క్రితం కురిసిన చిరుజల్లుతో నేలలు చిత్తడిగా మారడంతో చేతులతోనే బురదలో వరి విత్తనాలను కలిపి నారుమడులు తయారు చేశారు. ఆ తరువాత వర్షం కురుస్తుందని ఆశించినా కనీసం చిరుజల్లులు కూడా లేకపోవడంతో నారుపోసిన బురద మడి ఎండిపోవడంతో విత్తనాలు సరిగ్గా మొలకెత్తలేదు. రైతులు నారుమడులకు నీటిని సరఫరా చేసేందుకు ఆయిల్ ఇంజిన్ల కోసం పరుగులు పెడుతున్నారు. దీంతో మోటార్లకు డిమాండ్ ఏర్పడింది. అయ్యో ఇదేం అదనపు భారమంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


అర్జునగిరిలో ఎండుతున్న వరినారుమడికి నీటితడి అందిస్తున్న రైతు

బలవంతపు భూసేకరణ నిలిపివేయాలి

కె.కోటపాడు : మండలంలో ఆర్లి, చింతపాలెం, గరుగుబిల్లి ప్రాంతాల్లో వ్యవసాయ భూములను ఎస్‌ఈజెడ్‌ల కోసం రైతుల నుంచి బలవంతంగా తీసుకోవడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.వెంకన్న అన్నారు. ఎస్‌ఈజెడ్‌లకు భూకేటాయింపుల కోసం రైతుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా రహస్య సర్వేలను రెవెన్యూ అధికారులు చేస్తూ వారిని ఇబ్బందులు పెట్టే చర్యలు ఎంత మాత్రం సమంజసం కాదని ఆయన అన్నారు. బలవంతపు భూ సేకరణ నిలుపుదల చేయాలని కోరుతూ కె.కోటపాడు మండల తహసీల్దార్‌కు ఈ నెల 16న చెప్పుకుందాం.. కదిలిరండి కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, ఈ మూడు గ్రామాల్లో రైతులను ఆదివారం కలిసి కరపత్రాలను అందించి ప్రచారం చేశారు. ఉదయం 10 గంటలకు మూడు గ్రామాల్లోని రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ధర్నాకు హాజరుకావాలని ఆయన కోరారు. అచ్యుతాపురం ప్రాంతాల్లో ఉన్న కంపెనీల వ్యర్థాలు సముద్రంలో కలుస్తున్నాయని, మరి ఈ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న కంపెనీల వ్యర్థాలు ఎక్కడకు విడిచిపెడతారని అధికారులను వెంకన్న ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు యర్రా దేముడు, ఈర్లె నాయుడుబాబు, రొంగలి ముత్యాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.


ఆర్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకన్న

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

దేవరాపల్లి: మండలంలోని తామరబ్బ యూపీ స్కూల్‌లో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సౌజన్యంతో అనకాపల్లి జిల్లా శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సత్యసాయి శత జయంతి ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరంలో తామరబ్బ, చింతలపూడి పంచాయతీల పరిధిలోని శివారు గిరిజన గ్రామాల నుంచి హాజరైన 536 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో జనరల్ విభాగం వైద్యులు శేషు కుమార్, అశ్వినికుమార్, సిహెచ్.దినేష్, పి.నాగేశ్వరరావు, గైనిక్ వైద్యులు డా.ఝాన్సీ రాణి, డా.శోభారాణి, డా.విజయ, ఈఎన్‌టీ వైద్యుడు డా.మురళీకృష్ణ, డెంటల్ వైద్యులు డా.శ్యామ్ సుందర్, డా.లక్ష్మీనారాయణ, ఆర్థోపెడిక్ డా.ఆదిరెడ్డి సత్యవంశీ, డెర్మటాలజీ డా.జగన్‌మోహన్‌రావు, కార్డియాక్ డా.శంకరనారాయణ, పీడియాట్రిక్ డా.ఫణీంద్ర, తదితర వైద్య బృందం వైద్య సేవలందించారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు, స్థానిక సర్పంచ్ టోకురి రామకృష్ణ, ఉప సర్పంచ్ గుమ్మడపు దేవి మహేష్ తదితరులు పాల్గొన్నారు.


తామరబ్బలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుల బృందం

పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా చినబాబు

మాకవరపాలెం: పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా గిడుతూరు మాజీ సర్పంచ్ శీరంరెడ్డి నాగవెంకటచినబాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు అందాయని పీఏసీఎస్ సీఈవో భూషణరావు ఆదివారం తెలిపారు. పర్సన్ ఇన్‌చార్జ్‌గా చినబాబును నియమించగా డైరెక్టర్లుగా రాచపల్లికి చెందిన అడిగర్ల రాంబాబు, తాడపాలకు చెందిన గనిశెట్టి శంకర్రావులను నియమించినట్టు భూషణరావు తెలిపారు.

కె.కోటపాడులో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం రేపు


ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్

కె.కోటపాడు : కె.కోటపాడు రావాలమ్మ ఆలయం వద్ద మంగళవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంపై మండల స్థాయి కార్యకర్తలతో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ తెలిపారు.

కె.కోటపాడులో ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఈర్లె అనురాధ హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండలంలోని 32 గ్రామాల్లో పార్టీ మద్దతుదారులైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

ఘనంగా మోదమాంబ అమ్మవారి ఒడ్డు పండగ


ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో ఘటాలతో వస్తున్న భక్తులు

మాడుగుల: మండలంలో ఘాట్‌రోడ్డు జంక్షన్‌లోని మోదమాంబ పాదాలు వద్ద 108 ఘటాలతో అమ్మవారి ఒడ్డు పండగ ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక వర్తక సంఘం, ఆటో వర్కర్స్ యూనియన్ సంయుక్తంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు అమ్మవారి ఘటాలను నెత్తిన పెట్టుకుని ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, ఘటాలను అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం ప్రతినిధులు పుట్టా బలరామ్, కోట్ని సత్యంబాబు, పెచ్చేటి కొండలరావు, నాని, దంగేటి వాసు కోట్ని శ్రీను, ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, తదితరులు పాల్గొన్నారు.

బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం..

- కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తే మరింత బలపడతాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్
- నర్సీపట్నంలో నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం
- బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్


సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

నర్సీపట్నం: అధికారం కోసం అబద్ధాలు చెప్పి గద్దెనెక్కిన చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరిద్దామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ పిలుపునిచ్చారు. జగనన్న 2.0 పాలనలో జగన్ బటన్ నొక్కరని, కేవలం కార్యకర్తలు మాత్రమే బటన్ నొక్కుతారన్నారు. ఆదివారం స్టార్‌హోమ్స్ కల్యాణ మండపంలో పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రతి ఇంటికీ జరిగిన మోసాన్ని వివరించే క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ మాకవరపాలెంకు చెందిన టీడీపీ కార్యకర్త పార్టీ పెద్దల అండదండలతో కల్తీ మద్యం కంపెనీ నడుపుతున్నారని ఆరోపించారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయేనని స్పష్టం చేశారు. తల్లికి వందనం పథకంపై పసిపిల్లలకు కూడా చంద్రబాబు అబద్ధాలు చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టింది జగన్ అయితే, ఈ పథకానికి పేరు మార్చి అమలు చేస్తూ ఈ పథకాన్ని కనిపెట్టింది తన కొడుకు లోకేష్ అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెడితే గగ్గోలు పెట్టారని, ఈ రోజు హిందీ భాష గురించి కూటమి నాయకులు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కేవలం 15 నెలల కాలంలోనే రూ.1,60,000 కోట్లు చంద్రబాబు అప్పులు చేసి తీసుకొచ్చారన్నారు. జగన్ పేదల కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తే శ్రీలంకగా మారిపోతుందని ప్రచారం చేశారని, ఈ ప్రచారాన్ని ప్రజలు నమ్మారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పేదవాడికి మంచి చేసి ఓడిపోయారన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో రూ.500 కోట్లతో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల పనులను ఆపేయడం అన్యాయమన్నారు. కష్టపడి తీసుకొచ్చిన మెడికల్ కాలేజీని ఆపేస్తే, నియోజకవర్గ శాసనసభ్యునిగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే అక్రమ కేసులు బనాయించి భయపెట్టాలని చూస్తున్నారని, అక్రమ కేసులతో మనం మరింత బలపడతామన్నారు.

చంద్రబాబు పాలన.. జగనన్న పాలనను బేరీజు వేసుకోవడంతో ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందన్నారు. దివంగత మహానేత రాజశేఖర్‌రెడ్డి పేరు చెబితే ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు చెబితే అమ్మఒడి, రైతు భరోసా, చేయూత వంటి పథకాలు గుర్తుకొస్తాయన్నారు. నాలుగుసార్లు సీఎంగా చేసిన చంద్రబాబు పేరు చెబితే చెప్పుకునేందుకు ఒక్క పథకం కూడా లేదని ఎద్దేవా చేశారు. 75 ఏళ్ల తరువాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఉన్న 45 వేల పాఠశాలలను రూ.15 వేల కోట్లతో తీర్చిదిద్దారన్నారు. పేరెంట్స్ మీటింగ్ వెళ్లి అబ్బా, కొడుకులు కూర్చున్న బెంచీలు కూడా జగనన్న ఇచ్చినవేనని చెప్పారు.

ఏపీ టాక్స్ పేరుతో దోపిడీ..


మాట్లాడుతున్న ఉమాశంకర్ గణేష్

మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మాట్లాడుతూ ఏపీ టాక్స్ అంటే ఆంధ్రప్రదేశ్ టాక్స్ అనుకుంటే పొరపాటు..అయ్యన్నపాత్రుడు టాక్స్ పేరుతో దోపిడీ జరుగుతుందన్నారు. ఒక్క లేట్ రైట్ అక్రమ తవ్వకాల ద్వారా రోజుకి రూ.3 కోట్లు దోచుకుంటున్నారని విమర్శించారు. రాయి, ఇసుక క్వారీలలో ఏపీ టాక్స్ పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధికారాన్ని అడ్డుపెట్టుకొని లేట్‌రైట్ ద్వారా నెలకు రూ.300 కోట్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇది చాలక పక్క నియోజకవర్గంలోని రోలుగుంట క్వారీ లారీల నుంచి టన్నుకు రూ.250 ఏపీ టాక్స్ పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. తమ పార్టీ నాయకులు కర్రి శ్రీనివాసరావు, అల్లంపల్లి ఈశ్వరరావుపై హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు.

ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న శోభా హైమావతి

పార్టీ పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే విఫలమైందని విమర్శించారు. పార్టీ కార్యక్రమాల నిర్వహణలో నర్సీపట్నం నియోజకవర్గం నెంబర్ వన్ అని ప్రశంసించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు అబద్ధపు హామీలను వివరించాలన్నారు. ఏడాది కాలంలో సంక్షేమ పథకాలకు పంగనామం పెట్టారన్నారు. అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్ ప్రయాణం పథకాలను అటకెక్కించారని విమర్శించారు. ప్రజలకు అండగా ఉండాలన్న ఉద్దేశంతో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. కూటమి ప్రభుత్వం కూలేందుకు నర్సీపట్నం నుంచి పునాదులు పడాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల సన్యాసిపాత్రుడు, ప్రధాన కార్యదర్శి రుత్తల యర్రాపాత్రుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, జిల్లా మహిళా అధ్యక్షురాలు లోచల సుజాత, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, ఎంపీపీలు సుర్ల రాజేశ్వరి, గజ్జలపు మణికుమారి, సాగిన లక్ష్మణ్‌మూర్తి, రుత్తల సర్వేశ్వరరావు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు శానపతి వెంకటరత్నం, పణిశాంతరామ్, నాగేశ్వరరావు, చిటికెల రమణ, అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రియల్ హీరో జగన్..


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

పార్టీ యలమంచిలి సమన్వయ కర్త కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ రియల్ హీరో జగన్‌మోహన్‌రెడ్డి అయితే.. చంద్రబాబు మోసగాడు అంటూ తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుందన్నారు. తమ చోడవరం నాయకుల చేతకాని తనం వల్ల నర్సీపట్నం నాయకులు తమ క్వారీ లారీల నుంచి దోచుకుంటున్నారన్నారు. ఇలాంటి వారి పరిపాలనలో మనం ఉన్నందుకు సిగ్గుపడుతున్నామని చెప్పారు. ఎన్ని కేసులు పెట్టిన భయపడవద్దన్నారు. ఇచ్చిన హామీలను బుట్టదాఖలు చేశారన్నారు. ఇకపై సంక్షేమ పథకాల బటన్ నొక్కే కార్యక్రమం గ్రామస్థాయి నాయకులేదన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


నర్సీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

నర్సీపట్నం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1978–80 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. 45 ఏళ్ల తరువాత ఒక్క చోట చేరడంతో వారిలో నవ్వులు వెల్లువిరిశాయి. ఒకరిని ఒకరు ఆప్యాయతగా పలకరించుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి దశలో జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అప్పటి గురువులు ఇంగ్లిష్ అధ్యాపకుడు శాస్త్రి, తెలుగు అధ్యాపకుడు నర్సింహమూర్తి, హైస్కూల్ ఇంగ్లిష్ టీచర్ రమణరావులను శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థి, కూచిపూడి నృత్య అకాడమీ నిర్వాహకుడు ధనం మాస్టార్ శిష్యుల నాట్యం ఆకట్టుకుంది.


సమావేశమైన వడ్డాది కేపీడీ జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

వడ్డాది హైస్కూల్‌లో..

బుచ్చెయ్యపేట: వడ్డాది కోవెల అప్పన్నదొర జిల్లా పరిషత్ హైస్కూలులో 1997–98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ బ్యాచ్‌కు చెందిన 100 మంది విద్యార్థులకు 79 మంది హాజరై సందడి చేశారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థులు మంచాల నానాజీ, ఆడారి సూర్యప్రకాశ్, సాయం సురేంద్ర, సింగారపు సూరిబాబు, లత, మజ్జి ఈశ్వరరావు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ చోడవరం శాఖ కార్యవర్గం ఎన్నిక


పసుమర్తి సాంబశివరావును అభినందిస్తున్న ఇతర సభ్యులు

చోడవరం: లయన్స్ క్లబ్ చోడవరం శాఖ నూతన కార్యవర్గం 2025–26 సంవత్సరానికి ఎన్నుకైంది. నూతన అధ్యక్షుడిగా పసుమర్తి సాంబశివరావు, కార్యదర్శిగా బద్దిమంత్రి పాల్గుణ, కోశాధికారిగా పనతల గంగాధర్ ఆదివారం స్థానిక ఓ ఫంక్షనన్ హాలులో జరిగిన కార్యక్రమంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత అధ్యక్షుడు నీలం నాగేంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ లయన్ డాక్టర్ అధికారి గోపాలరావు హాజరై నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే రాజు, తదితర్లు నూతన కార్యవర్గాన్ని అభినందించారు. జీఎంటీ కో–ఆర్డినేటర్ పుసర్ల సుధీర్, రీజనల్ చైర్‌పర్సన్ చెరుకూరి ఇందిర, జోన్ చైర్మన్ ఉప్పల వెంకటరాజు.. క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కాండ్రేగుల డేవిడ్, పుసర్ల శకుంతలరావు, న ల్లమిల్లి గనిరెడ్డి, ముక్కా రమేశ్, ఉగ్గిన నాగబాబు, వేపాడ సత్యనారాయణ, షాపింగ్ శ్రీనివాస్, కటకం దీపక్, డాక్టర్ హరిబాబు, పసుమర్తి మల్లిక్, సిరిసోల్ల ఆదిగణపతినాయుడు తదితరులతో ప్రస్తుత కార్యదర్శి వాణిబాబు ప్రమాణ స్వీకారం చేయించారు.